

"నారాయణ! నారాయణ" అంటూ నారదుడు మేఘాల మీద నడుచుకుంటూ వచ్చి శ్రీమన్నారాయణుణ్ణి నిద్ర లేపాడు.

"ఈ రకరారు మహానుభావులు" అంటూ బద్ధకంగా లేచి ఆవులించాడు దేవుడు.

మళ్ళీ ఆవులించమన్నాడు నారదుడు. 'సరే' నని అతని కోరికపై మళ్ళీ ఆవులించాడు దేవుడు.

అండపిండ బ్రహ్మాండకోటిని అంతటిని అతని నోట్లోనే చూసి తరించి—"దేవదేవా! ఈ సృష్టి అంతటిని శాసించే వాడివి—మానవుణ్ణి మాత్రం అదుపులో పెట్టలేకపోతున్నావు. ఎన్నిసార్లు వేడుకున్నా, ఎన్నిసార్లు హెచ్చరించినా ఇలా ఉదాసీనంగా ఊరుకుంటున్నావు. ఇలాగైతే కొన్నాళ్ళకి మానవుడు దేవుణ్ణి మించిపోతాడు" అని నారదుడు మానవుడి మీద ఫిర్యాదు మొదలు పెట్టాడు.

"మానవుడు సుఖంగా ఉంటే దేవుణ్ణి మరిచిపోతాడు అన్నావు. మనిషికి ఎప్పుడూ ఏదో కష్టాన్ని కల్పిస్తూ, ప్రతి క్షణం దేవుణ్ణే తల్చుకునేటట్లు చేయమన్నావు. ఇంకా ఏం చెయ్యమంటావు?" అనడిగాడు దేవుడు.

"మానవుడు శాస్త్ర విజ్ఞానాన్ని పెంచుకుని రోజుకో సాధనాన్ని కనిపెడుతున్నాడు. వేసవిలో చల్లగాను, శీతాకాలంలో వెచ్చగానూ నివసిస్తున్నాడు. దూరశ్రవణాన్ని, దూరదర్శనాన్ని సాధిస్తున్నాడు. వాయువేగ, మనోవేగాలతో ప్రయాణిస్తూ చంద్రమండలానికి చేరుకున్నాడు. ఇంకా ఊరుకుంటే తిన్నగా ఇక్కడికే వచ్చి నిన్ను జరగమని నీ స్థానంలో కూర్చుంటాడు. తరవాత మీ ఇష్టం" అన్నాడు నారదుడు. కోపంగా విన్నవించుకున్నాడు.

"నన్ను ఇక్కడ కూర్చోపెట్టినవాడు, నన్ను కనిపెట్టినవాడు మానవుడే కదా! అంతగా కావాలంటే అతన్నే ఇక్కడ కూర్చోమను" అన్నాడు దేవుడు చిరునవ్వుతో.

"నీ కసలు రాజకీయం తెలియదయ్యా, దేవదేవా! మానవుడు సంతృప్తి సాధించాడంటే సర్వేశ్వరుణ్ణే మర్చిపోతాడు. కాబట్టే మానవుణ్ణి ఎప్పుడూ అసంతృప్తితోటే ఉంచాలి" అన్నాడు నారదుడు.

"అసంతృప్త వర్గాలు ఎప్పటికైనా ప్రమాదమే! ఏదో ఒక రోజు తిరుగుబాటు చేస్తారు" అని సెలవిచ్చారు దేవుడుగారు.

"ఎంత తిరుగుబాటు చేసినా, విజయంకోసం నీ గుడి చుట్టూనే ప్రదక్షిణాలు చేస్తారు. నీ దగ్గరకే వచ్చి గుండు చేయించుకుంటారు. కాబట్టే మానవుడు ఎంత ప్రగతి సాధించినా, ఎన్ని సాధనాలు కనిపెట్టినా ప్రతిదీ అతనికి సుఖాన్ని బదులు కష్టాన్నే తెచ్చే ఏర్పాటు చెయ్యాలి" అన్నాడు నారదుడు.

ఇంతలో ఇంద్రుడు పరిగెట్టుకుంటూ వచ్చి, "దేవా! నరకంలో తిరుగుబాటు వచ్చింది. అలెగ్జాండర్ గ్రాహంబెల్ అనే పుణ్యాత్ముడు మానవుడి సుఖజీవనం కోసం టెలిఫోను అనే దూరశ్రవణ యంత్రాన్ని కనిపెట్టాడు. అయితే, ఇప్పుడు ఆ టెలిఫోను వల్ల ప్రజలు సుఖానికి బదులు అనేక కష్టనష్టాలకి గురవుతున్నారు కాబట్టి అతణ్ణి కూడా నరకానికి బదిలీ చేయాలని నరకంలో వాళ్ళందరూ తిరుగుబాటు చేస్తున్నారు" అని మనవి చేశాడు.

"అతడి పాప పుణ్యాల లెక్కలు సరిగ్గా చూశారా, లేదా? చిత్రగుప్తుడు ఏం చేస్తున్నాడు?" అనడిగారు దేవుడుగారు.

"లెక్కల ప్రకారం అతడు మానవుడి సుఖ జీవనం కోసం టెలిఫోను కనిపెట్టడం వల్ల పుణ్యాత్ముడు. కానీ, ఆ టెలిఫోను వల్లనే ప్రజలు పడే కష్టాలు లెక్కచూస్తే అతడు పరమ పాపాత్ముడు. ఏం చెయ్యాలో తమరే సెలవివ్వాలి" అని దేవేంద్రుడు విన్నవించాడు.

దేవుడు చిరునవ్వు నవ్వి నారదుడి కేసి చూసి, "నువ్వేమంటావు, నారదా!" అనడిగాడు.

"సదుద్దేశంతో సుఖజీవనంకోసం ఆ నాడు అలెగ్జాండర్ గ్రాహంబెల్ కనిపెట్టిన 'టెలిఫోను'— ఈ నాడు అస్తవ్యస్తంగా తయారై 'నలిఫోటు'గా మారి మానవుడికి ప్రాణసంకటంగా పరిణమించింది. ఫోను అవసరమొచ్చిన ప్రతి మానవుడు కనెక్షన్ దొరక్క 'దేవుడా!' అని నెత్తి నోరు మొత్తుకుంటున్నాడు. మానవుడు ఇన్నిసార్లు దేవుణ్ణి తలుచుకునేట్టు చేసిన అలెగ్జాండర్ గ్రాహంబెల్ ఏ లెక్క ప్రకారం చూసినా పుణ్యాత్ముడే! కాబట్టి స్వర్గంలోనే ఉండాలి. అయితే, అతణ్ణి ఒక గదిలో పెట్టి రెండు టెలిఫోన్లు పెట్టండి. అతనికి ఏది కావాలన్నా ఫోనులోనే అడగాలి. ఆ ఫోన్లు సరిగ్గా పనిచెయ్యక అతడు స్వర్గంలోనే నరక యాతన అనుభవించాలి. అతనికి అదే తగిన శాస్తి" అన్నాడు నారదుడు.

దేవుడుగారు "తథాస్తు" అన్నాడు.

(అంకితం: ఈ పేజీ పరమపుణ్యాత్ములైన శ్రీ టెలిఫోను శాఖ వారికి భక్తితో అంకితం.)

- తంబు

# మనిషాతే

